

# పాఠకులకు మాత్రమే

యజ్ఞంశెట్టి శాయి

"నువ్ నా గురించి ఏమనుకొంటున్నావక్కా? ఏమీ దాచకుండా చెప్పెయ్యవూ? ఇవాళ పూర్తిగా మనసులు విప్పి మాట్లాడుకోవాలనుంది నాకు."

సుజాత కళ్ళల్లోకి చూస్తూ అంది అరుణ.

సుజాత ఉక్కిరి బిక్కి రయింది. ఇలాంటి పరిస్థితీ-ప్రశ్నా అరుణనుంచి ఉత్పన్నమవుతాయనుకోలేదు.

అరుణ వచ్చిన ఈ పదిహేను రోజుల్లోనూ ఇద్దరూ ప్రాణ స్నేహితురాండ్రయి పోయారు. కాని తనలో తలెత్తిన అనుమానాలు మనుషులమీద తనకు గల నమ్మకాన్ని వేళ్ళతో సహా పెకలించి వేసినయి.

ఆ రోజు....

ఆఫీస్‌నుంచి పెందలాడే వచ్చేశా రాయన. కారు హారన్ విని ఆశ్చర్య పోయింది తను. కాపరానికొచ్చి సంవత్స రం దాటిందిగాని ఏరోజూ అంతత్వరగా ఇంటికి రాలేదు.

"ఏమిటివాళ విశేషం! నాలుగింటికే ఇంటిమీద ప్రేమ కలిగిందే?" అడిగింది తను నవ్వుతూ.

"చెప్పమంటావా?"

"అనే అర్థం."

"ఇందుకూ...." అంటూ తనని అధాటున మీదకు లాక్కొన్నారు. అనుకోకుండా లాగేసరికి తూలి పూర్తిగా ఆయన కౌగిట్లో ఇమిడిపోయింది,

"నిజం సుజీ! కాగితాలమీద సంతకం పెడుతోంటే నీ రూపమే కళ్ళగ్గనబడుతోంది. పైగా పంచరంగుల్లో!–అంతే! ఇక ఆగటం నావల్లకాలేదు. కాగితాలు విసిరి టేబుల్ మీద పడేసి ఆఖరికి మా హెడ్‌క్లర్క్‌గ్గూడా చెప్పకుండా ఇల్లు చేరుకొన్నాను."

క్షణకాలం తన మనసులో ఓవిధమైన ఆనందం, గర్వం, తృప్తి–అన్నీ మిశ్రమయి నృత్యం చేసినయి.

"అన్నీ అబద్ధాలు" అంది నమ్మనట్లు నటిస్తూ.

అదుగో–అలా అన్నావంటే నువ్వంటే నాకెంత ఇష్టమో ప్రాక్టికల్‌గా చూపించాల్సి వస్తుందమ్మాయ్!" మరింతగా తనలోకి అదుముకొంటూ అన్నారాయన.

"వదలండి! తలుపులు తీసే ఉన్నాయి, ఎవరయినా రాగలరు."

"ఎవరా వచ్చేది? సిగ్గుండక్కర్లా?"

"ఎవరికీ?"

"వాళ్ళకే...."

కిలకిల నవ్వేసింది తను.

"అన్నట్లు ఇవాళేదయినా సిన్మాకెళ్దాం. ఏం? త్వరగా రడీ అవుతావా? డిన్నర్ కూడా ఏదో హోటల్లో కానిచ్చేద్దాం. 'నైట్ అవుట్' వెళ్ళి చాలా రోజులు కూడా అయింది. ఏమంటావ్?"

"ఓకే!" అంది తను ఉత్సాహంగా.

మరోగంటలో ఇద్దరూ కార్లో ఆబిడ్స్ చేరుకున్నారు. షాపింగ్ సెంటర్‌ముందు ఆపి దిగారాయన.

"ఇక్కడెందుకూ?"

"దిగవోయ్ ముందు. తర్వాచ్చెప్తాను" అన్నారు నవ్వుతూ.

దిగినుంచుంది తను.


"నావెంట తిన్నగా ఆ బట్టల షాపులోకిరా! ఏం ప్రశ్నలేయడానికి వీల్లేదు."

"కాని, ఇప్పుడు."

"ప్రశ్నలు 'బాన్' చేశాను."

"అలాగయితే నేనసలురాను. ఇక్కడే నుంచుంటాను."

"ఒహ్హో! సిల్లీగాళ్! దగ్గరకురా చెవిలో చెప్తాను."




"ఇంకా నయం! ఇదేమయినా ఇల్లులా కనబడుతోందా ఏమిటీ ఖర్మ?"

"ఛప్! అందుక్కాదు. అసల్సంగతేవిటంటే అనగనగా ఓ అమ్మాయి."

"కథా?"

"చాలా చిన్నదిలే! నువ్వు స్పృహ తప్పేలోగానే పూర్తయిపోతుంది. ఎందాకా వచ్చానూ?"

"అనగనగా ఓ అమ్మాయి."

'అవును. ఆ అమ్మాయి చాలా అందంగా వుంది."

"మీకు ఏ అమ్మాయి అందంగా కనబడదు కనుక."

"షరా—మధ్యలో అడ్డు మాట్లాడరాదు—ఆ అమ్మాయేమో ఇంకా బోలెడు అందమయిన చీర——ఎంత అందమయిందంటే ఆ చీరకట్టుకోడంమూలాన—ఆ అమ్మాయి అందం పదింతలయిందన్నమాట—కట్టుకొని లకడీకాపూల్ దగ్గర బస్‌కోసం నిలబడింది——"

"ఇంకా అబ్బాయి రాలేదేం కథలోకి?"

"వచ్చేశాడు—అతగాడేమో కార్లో అటు వెళ్తున్నాడు. వెళ్తూ వెళ్తూ అటుచూసి ఠకీమని 'లవ్'లో పడిపోయాడు."

"ఆ అమ్మాయితో!"

"అక్కడే దెబ్బతినేశావ్! ప్రేమలో పడింది ఆ అమ్మాయితో కాదు. ఆ అమ్మాయి కట్టుకొన్న చీరతో—ఎలాగయినా సరె—ఆ చీర తీసుకెళ్ళి తన ముద్దుల పెళ్ళానికి ఇచ్చేయాలనుకొన్నాడు."

"ఛీపోడు! ఆ అమ్మాయి వప్పుకొంటుందేమిటీ? ఆ చీర రోడ్డుమీద తీసిచ్చేయడానికి?"

"చీర-అంటే ఆ చీరే అని అపార్థం చేసుకొన్నావ్!—'అలాంటి చీరె' అని అర్థం—అందుకని వెంటనే ఆఫీసునుంచి పెందలాడే ఇంటికెళ్ళిపోయి పెళ్ళాన్ని వెనకసీట్లో వడేసుకొని షాపుకి చేరు కొన్నాడు కార్లో!"

"తరువాత?"

"కథ కంచికీ-మనం షాపుకీ!-ఆ చీర చూపిస్తాను షాపులో నీకు! నచ్చితే వెంటనే రెండుకొని తీసుకెళ్దాం."

"రెండెందుకూ?"

"రోజుకొకటిచొప్పున కట్టుకోడానికి."

"మీలాంటి వేలాంవెర్రి మొగుడో సారి...."

"కధకి టైంలేదు. సిన్మాకి టైమవు తోంది—ముందు షాపులోకి పద."

ఇద్దరూ షాపులోకి నడిచారు. అయిదు నిమషాల్లోనే ఆ చీర కనిపించింది.

"ఇదే....ఎగ్జాక్ట్లీ ఇదే"అన్నారాయన ఆనందంగా. నిజంగా చాలా అద్భుతంగా ఉందనిపించింది తనకూ్కడా.

"ఎంత ఇది?"

"రెండువందల అరవై."

"వెరీగుడ్ - ధరకూడా అందమైనదే- రెండు చీరలు పాక్ చెయ్యండి."

"రెండెందుకూ?" చిరాకుపడింది తను.

"ప్లీజ్! ఉండనీ" అంటూ బిల్లు చెల్లించి బయటకు నడిచారు.

కారు సినిమాహాలు వేపు దూసుకు పోసాగింది.

"మీరు డబ్బు అనవసరంగా వృధా చేస్తున్నారు."

"తప్పు!- 'వృధా' అనకూడదు."

"ఖచ్చితంగా అంటాను."

"నీ యిష్టం. నా మాటెప్పుడువిన్నావ్ కనుక.... కట్టుకున్న పెళ్ళానికి, కట్టుకో డానికి చీరలు కొనేహక్కు నాకు లేదన్న మాట.... అంతేనా?"

"నేనలా అనలేదు!"

కారు థియేటరు ముందు, కాంపౌం డులో ఆగింది.

ఇద్దరూ పాకెట్ డిక్కీలో ఉంచి లాక్ చేసి టిక్కెట్స్ తీసుకొని హాల్లోకి నడి చారు. ఎయిర్ కండిషన్ థియేటరవడం మూలాన లోపల చలిగావుంది. అప్పటికే న్యూస్‌రీలు మొదలయింది. సిల్వర్‌జూబ్లీ సెలబ్రేషన్స్- స్వాతంత్రం వచ్చినతరు వాత ఈ పాతికేళ్ళలోనూ మనం చేసిన ఘనకార్యాలు కొన్ని- పేద్ద! డాముల రూపంలోనూ, ఫ్యాక్టరీల రూపంలోనూ, అంకెల రూపంలోనూ కనిపించినయి. తరువాత వర్షంలేనందువల్ల పంటలు నాశన మైపోయిన కొన్ని రాష్ట్రాలు క్యూలో చూపించారు. ఆ తర్వాత వరదల్లోకొట్టుకు పోయిన ఊళ్ళని కొద్దిక్షణాలు సారోపుల్ మ్యూజిక్‌తో షూటింగ్ తీశారు. తరువాత ఏవో ఆటల పోటీలు - అంతే! అసలు సినిమా మొదలయింది.

హీరోయిన్, హీరో కలసి ఆంధ్ర

దేశంలోని బృందావన్ గార్డెన్స్ లో ఘుమ్మని డాన్స్ చేశారు. చాలా బీద కుటుంబానికి చెందినవారయినా. కష్టపడి ఈలోగా పదహారు డ్రస్సులు మార్చారు.

"బహుశా వాళ్లు లక్షాధికారులకెవరి కయినా బట్టలుతుకుతారేమో! లేకపోతే అంత ఖరీదయినవి ఎలా వేసుకోగలరు?" అన్నారాయన.

తనకు నవ్వు ఆగలేదు. "అంటే ఆ డ్రస్సులు వాళ్లవి కావనా?"

హఠాత్తుగా సీన్ మారిపోయింది.

మరో ఆడకూతురు ఎక్కడ్నించో వచ్చి ఠకీమని అదే హీరోని గంటకు రెండువందల కిలోమీటర్లవేగంతో ప్రేమిం చేసింది. ఆ ప్రేమని తోసిపుచ్చలేకపో యాడు హీరో!

ఇద్దరూ బ్రహ్మపుత్రా నదిలో నడుం వరకు మునిగి చలికి ఆగలేక ప్రేమపాట పాడారు.

"మనం పెళ్ళిచేసుకుందామా?" అడి గిందా పిల్ల.

హీరోకి ఏడుపొచ్చింది.

"ఔనననా? కాదననా?" అని విరహ గీతం పాడుకొంటూ భద్రాచలం అడవుల్లో తిరిగాడు, ఇంటర్వెల్ అయింది.

"అన్నట్లు నీకు చెప్పడం మర్చిపో యాను! రేపు హౌరా ఎక్స్ప్రెస్‌కి అరుణ వస్తోంది మనింటికి...." అన్నారు ఉత్సా హంగా.

"అరుణా?.... ఎవరామె?".

"నీకు అరుణ తెలీదా?" ఆశ్చర్యంగా తనవంకచూస్తూ అన్నారాయన.

"బొత్తిగా తెలీదు. ఏం? మీకు తెలుసా? అసలా అమ్మాయి ఎవరు?"

"బహుశా నీకు తెలీదనుకుంటానులే! కొంచెం దూరపు బంధుత్వం అనుకో! అయినా చిన్నప్పటినుంచీ కలసి తిరిగాం. చదువుకొన్నాం. పెళ్లయింతర్వాతభర్తతో విజయనగరం వెళ్ళిపోయింది. అంతే రెండేళ్లపోయింది. ఇంతవరకూ మళ్ళీ చూడటం పడనే లేదు. మధ్యాహ్నం టెలిగ్రాం వచ్చింది తను రేపువస్తున్నట్లు"

"ఓహో...."

"మనం పొద్దున్నే వెళ్ళి రిసీవ్ చేసు కోవాలి. చాలా సరదాగా, చనువుగా వుంటుందిలే.... నువ్వేం కొత్తదనం ఫీల వ్వక్కర్లేదు...."

"అలాగా—"

"పైగా వారపత్రికలో ప్రశ్నలకు నువ్విచ్చే జవాబులంటే పడిచచ్చిపోతుంది. మన వివాహ మవకముందే నీ జవాబుల గురించి పొగుడుతూ ఉత్తరాలు రాస్తూం డేది. ఎటొచ్చీ మన పెళ్ళవడం, వెంటనే నాకు హైద్రాబాద్ ట్రాన్స్ఫర్ కావడం- మూలాన ఆ గొడవల్లో ఆగిపోయినాయి. పెళ్ళయిన కొత్తలో ఒక ఉత్తరం వ్రాసింది. అదే అఖరి ఉత్తరం అను కొంటాను. ఎంత బాధపడుతూ రాసిందనీ

పెళ్ళికి రాలేకపోతోందని: పైగా పత్రికలో జవాబుల శీర్షిక నిర్వహించే సుజాతే పెళ్లి కూతురని తెలిసేప్పటికి ఎంత సంతోష పడిందో తెల్సా? రెండు పేజీలు నీ గురించే రాసింది ఆ ఉత్తరంలో. ఎంత త్వరగా మనింటికి వచ్చి నిన్ను చూస్తానా అని ఉవ్విళ్ళూరుతోందిట – దానికి నేను జవాబు రాయనేలేదు...."


తనకి కొంచెం గర్వంవేసింది. తన జవాబులంటే ఆంధ్రదేశంలోని ఆడవాళ్ళం దరూ ఎలా పోటీలుపడి చదువుతారో తనకి బాగా తెలుసు. పత్రిక వాళ్ళకి అందుకే తనంటే చాలా గౌరవం భక్తీనూ! ఒక వారం కథలూ-సీరియల్సూ కూడా ఆపేసి మొత్తం జవాబుల శీర్షికే వేసే శారు. ప్రతీ ఊళ్లో తనని ఆరాధించే స్త్రీ లున్నారు. ఒక్క స్త్రీలనే ఏమిటి? పురు షులు మాత్రం? ఎన్ని ఉత్తరాలు రాసే వారు? పెళ్లికాక ముందు చాలా మంది ప్రేమ లేఖలు కూడా రాశారు. అల్ప సంతోషులైన ఆంధ్రదేశపు ప్రజానీకాన్ని తల్చుకొంటే జాలికూడా కలిగిందామెకి. తను ఒకే ఒక నవల ఆ పత్రికలో సీరి యల్‌గా రాసింది. అది కూడా ఒక ఇంగ్లీష్ నవలకు కాపీ! ఈ సంగతెలీక అందరూ తనని ఆకాశాని కెత్తేశారు. అంతే! వెంటనే పత్రిక వాళ్ళు తనని అభ్యర్థించి జవాబుల శీర్షిక నిర్వహించడా నికి నియమించారు. అప్పట్నుంచీ తను ఎంతమంది జీవితాల్ని సరిదిద్దిందో-ఎంత మంది ఎదుర్కొంటున్న చిక్కుల్ని విడ దీసిందో-ఎన్ని సంసారాల్ని నిలబెట్టిందో అంతులేదు. తన జవాబుల మూలాన లాభం పొందిన వాళ్లు అనేకమంది తరు వాత ఉత్తరాలు రాశారు ధన్యవాదాలు తెలుపుతూ!

మళ్ళీ సినిమా మొదలయింది.

హీరో, ఎవర్ని పెళ్ళాడాలా అన్న విషయం మీద బొమ్మా బొరుసూ వేసు కొంటున్నాడు. ఆయన అరుణ గురించి ఇంకా చెప్తూనే ఉన్నారు. చాలా అల్లరి పిల్ల కూడానుట. ఓసారి నిచ్చెన వేసి తనని బాదం చెట్టు ఎక్కించి నిచ్చెన లాగి వేసిందట. రెండు గంటలు చెట్టుమీదే ఉండిపోవాల్సి వచ్చిందిట ఆయన. గుర్తుకి తెచ్చుకొని నవ్వుతూ చెప్పారాయన.

ఇద్దరు హీరోయిన్లూ, హీరో కలిసి ఏడుస్తూ డ్యూయెట్ పాడారు.

అప్పటికప్పుడే ఓ రెడీమేడ్ విలన్ సిన్మాలో జొరబడి ఓ హీరోయిన్ని అర గంటసేపు యుద్ధం చేసింతర్వాత 'రేప్' చేశేశాడు. ఆ హీరోయిన్ ఇంట్లోకెళ్లి వాళ్ల బాబాయి తాలూకా పిస్టల్ తెచ్చి వాడినో గుండుతో కాల్చి, తనో గుండు కాల్చుకొని 'ఢ్ఛాం'మ్మంటూ చచ్చి పోయింది. వాడు బాంబేలో బిల్డింగుల మీద పారిపోతోంటే హీరో భీమవరం లోంచి చూచి (బైనాక్యులర్స్‌తో) జీప్‌లో ఆ బిల్డింగ్ చేరుకొని పైకెక్కి గంటసేపు




భీషణ స్టంట్ చేసి వాడిని చితగ్గొట్టేసి పోలీసులకి అందించేశాడు మద్రాసులో. సరిగ్గా అప్పుడే కొవ్వూరులో ఉన్న రెండో హీరోయిన్ మద్రాస్‌లో, అదే పోలీస్ స్టేషన్ చేరుకొంది హీరోని వెదుక్కొంటూ.

ఇద్దరూ అక్కడికక్కడే దండలు మార్చుకొన్నారు. హెడ్ కానిస్టేబుల్ వాళ్ళిద్దరినీ ఆశీర్వదించి, ఎందుకయినా మంచిదని వేలిముద్రలు తీసుకొన్నాడు. హఠాత్తుగా హాల్లో జనం లేచి కేకలేసుకొంటూ బయటకు పరిగెత్తారు. హాలుకి నిప్పంటుకొందేమో అనుకొంది సుజాత ఖంగారుగా.

"జనగణమన.... వేస్తారనీ...." అన్నారాయన నవ్వుతూ.

ఇద్దరూ క్వాలిటీ హోటల్లో భోజనం చేసి ఇల్లు చేరుకొన్నారు. పదయింది టైము. పడగ్గదిలో టేబుల్‌లాంప్ ముందు కూర్చుని ఆ వారం ప్రశ్నలు చదివి జవాబులు వ్రాయసాగింది సుజాత.

"అక్కయ్యా! నా జీవితం ఏదయినా ప్రమాదానికి గురవుతుందేమో అని కొంచెం భయం వేస్తోంది. వారంరోజుల్నించీ ఆయన నాదగ్గరకు రావటం లేదు. అసలెక్కడకుపోయారో కూడా తెలీదు.

పిల్లలందరూ "నాన్న ఏరి?" అని అడుగుతున్నారు! నాకేం చెప్పాలో అర్థం కావటంలేదు. అప్పులాళ్ళు ఇంటిచుట్టూ తిరుగుతున్నారు. ఏదయినా ఉద్యోగం చేద్దామంటే నాపొట్టకోసినా అక్షరంముక్క కనబడదు. అమ్మా నాన్నలు వద్దంటున్నా వినకుండా, ఆయనతో లేచివచ్చేసినందుకు ఇది నాకు భగవంతుడు విధించిన శిక్ష

అనుకొంటాను. ఇప్పుడు నాగతి ఏమిటి? నాలాంటివాళ్ళకి ఉపాధికల్పించే సంస్థ ఏమయినా ఉంటే వాటి అడ్రసులు ఇవ్వండి. మీ జవాబుకోసం గద్దలాగా ఎదుర్చూస్తుంటాను.''

"నీ పరిస్థితి చూస్తూంటే గుండె తరుక్కుపోతోంది చెల్లాయ్! నీకు భగవంతుడే సహాయం చెయ్యాలి! ఎప్పటికయినా అతను తన తప్పు తెలుసుకొని నీ దగ్గర కొస్తాడు అంతవరకూ ఓపికపట్టు!''

మరో ఉత్తరం తీసింది సుజాత.

"అతనూ, నేనూ 1960 లో ఓసారి మా బంధువుల పెళ్ళిలో కలుసుకొన్నాము. అయిదు నిమషాలపాటు ఇదరం ఒకరివంక ఒకరు చూసుకొన్నాం. తిరిగి పన్నెండేళ్ళ తరువాత ఈ మధ్య అతన్ని కలుసుకొన్నాను. భార్యాబిడ్డలతో గుడికివెళ్తూ కనిపించాడు. నాకు దుఃఖం ఆగలేదు. గత నెల్రోజులుగా ఏడుస్తూనే వున్నాను. చివరకు దుఃఖం పట్టలేక మీకీ ఉత్తం వ్రాస్తున్నాను. ఈ పురుషజాతి మోసాలకి ఒక హద్దులేదా అక్కా? నా కళ్ళల్లోకి అయిదు నిముషాలపాటు 'ఎక్స్‌రే' తీస్తున్నట్లు చూసి—నా హృదయాన్నిలాక్కొని—వన్నిలా అన్యాయం చేయటానికి అతని కెవరిచ్చారు అధికారం?''

"పిచ్చిరాధా! ఈ మొగాళ్ళు క్రూరులమ్మా! అలా హృదయం ఎక్కడపడితే అక్కడ పారేసుకోకు! ప్రపంచ చరిత్రంతా మన ఆడదానికి జరిగిన అన్యాయాలతోనే నిండిపోయింది! నీ కథ మరో పుట! అంతే! జరిగింది మెల్లగా మర్చిపోడానికి ప్రయత్నించు. ఆ పిల్ల 'కేస్' చూస్తే సుజాతకి నిజంగానే జాలికలిగింది. చదువూ సంధ్య లెక్కచలేనట్లుగా వుంది ఆ ఉత్తరంలోని అక్షరాలు చూస్తూంటే.

మరో ఉత్తరం తీసింది సుజాత.

"కొన్ని కారణాలవల్ల—నాకూ అతనికీ వివాహం కాలేదక్కయ్యా! అతను వాళ్ళ మామయ్యకూతురిని చేసుకొన్నాడు. నేను మా పెద్దాళ్ళు కుదిర్చిన సంబంధం చేసుకొన్నాను. కాని నాపెళ్ళయి సంవత్సరమన్నా తిరక్కమునుపే ఆయనతో కలతలు మొదలయినయి. ఈ మధ్యన హఠాత్తుగా గుండె జబ్బుతో మరణించారు. ఆ సమయంలో అతను వచ్చి నన్ను మానసిక సంక్షోభంనుంచి రక్షించి తన ఇంటికి తీసు కెళ్ళారు. ఈ కొద్దిరోజుల్లోనూ నేనూ, అతనూ తెలుసుకొన్న సత్యం ఏమిటంటే మేమిద్దరం ఒకరిని ఒకరు వదలి ఉండలేమని, కాని అతని భార్య ఈ విషయాన్ని ఎలా తీసుకొంటుందోనని భయపడుతున్నాను. అతను దగ్గరలేకపోతే నేను మాత్రం బ్రతకలేను. ఈ భయంకరమైన సమస్య ఎలా పరిష్కారం చేయాలో చెప్పి మా ముగ్గురినీ రక్షించండి. మీ జవాబు కోసం వేయికళ్ళతో ఎదుర్చూస్తుంటాను.''

రెండు నిముషాలు ఆలోచించింది



సుజాత. ఇలాంటి సమస్య ఇంతకుముందెప్పుడూ వచ్చినగుర్తులేదు. ఆ పరిస్థితిలో ఆ అమ్మాయి ఏం చేయాలా అని కొద్ది క్షణాలు ఆలోచించింది. అతని భార్యతో విషయమంతా చెప్పి, ముగ్గురూ కలిసి వుంటే మంచిదనిపించింది. అదే వ్రాయ సాగింది.

"చెల్లీ! నీది చాలా గడ్డుపరిస్థితమ్మా దీనికి పరిష్కారంఒక్కటే; మీముగ్గురూ నిష్కల్మషమైన హృదయాలతో చర్చించు

కాని ఒక నిర్ణయానికి రావడం మంచిది. ముగ్గురూ కలసి వుండటం ఏ దృష్టిలో చూచినా శ్రేయస్కరం. అతని భార్య పరిస్థితిని అర్థంచేసుకొని అందుకు అంగీకరించాలి! తెలివిగల స్త్రీగా ఆమె బాధ్యత అది" పదకొండు ప్రశ్నలకు జవాబులు వ్రాసి లైటార్పి పడుకొందామె. పదకొండు మంది స్త్రీ పురుషుల సమస్యలు గంటన్నర కాలంలో కాగితంమీద పరిష్కారమైపోయినయి.

"త్వరగా లేవాలి మరి. తెల్లారిపోతుంది ఇంకోపావుగంటలో రైలొచ్చేస్తుందట" అంటూ తట్టి లేపారాయన మర్నాడు ఉదయం.

లేచి టైమ్‌చూసింది సుజాత. ఆరవడానికి ఇంకా టైముంది. త్వరగా టాయిలెట్ అయి కార్లో ఇద్దరూ స్టేషన్ చేరుకున్నారు. రావల్సినటైముకి అయిదు నిమిషాలు ముందే వచ్చేసింది బండి.

ఎదురుగ్గా ఆగిన స్లీపర్‌కోచ్‌లో నుంచి దిగింది అరుణ.

"అదుగో అరుణ! హలో అరూణ్" అంటూ ముందుకు పరుగెత్తారాయన చిన్నపిల్లాడిలా. తనకు నవ్వువచ్చిందిఆయన్ని చూస్తే. మెల్లిగా తనూ అక్కడికి చేరుకొంది.

"మా శ్రీమతా? ఇదిగో! జవాబుల శీర్షిక సుజాత! అరుణ సుజీ! నీ ఫాన్!" అంటూ పరిచయం చేశారాయన.

"హల్లో! నమస్తే అక్కా! నేనను కొన్నాను. ఎప్పటికయినా మిమ్మల్ని కలుసుకు తీరాలని! ఆ కోర్కె కాస్తా ఠకీమని తీరిపోయింది. అబ్బ మీ జవాబులంటే నాకెంత ఇష్టమో మీకు తెలుసా? అన్నీ కట్‌చేసి బైండ్‌చేయించి దాచుకున్నాను. మీకది దేముడిచ్చిన వరమక్కా! అంత సూటిగా చక్కటి జవాబులివ్వడం అందరికీ చేతనయ్యే పని కాదు."

"కొంచెం పొగడటం తగ్గించండి లేకపోతే గర్వం పెరిగిపోతుంది నాకు."


"ఫర్లేదక్కా! మీరు నిజంగా గర్వపడాల్సిన జవాబులు మీవి."

"జవాబుల శీర్షిక గురించి రైల్వే స్టేషన్‌లో నే మాట్లాడుకోవాలని రూలేమీ లేదు. మీ కబుర్లు కావాలంటే కారులో కంటిన్యూ చేయవచ్చు. బయటకు పదండి!" అన్నారాయన.

ముగ్గురూ రెండు సూట్‌కేసులు కూలీలకిచ్చి బయటకు నడిచారు. పది నిమిషాల్లో ఇల్లు చేరుకొంది కారు.

"ఇదీ మా ఇల్లు! నీలాగానే సుజాతకి కూడా ఇల్లు అద్దంలా కనిపించేలా ఉంచడమంటే ఇష్టం. నాకొంచెం కష్టమే అనుకో ఈ పద్ధతి. అయినా తప్పదు మరి..."

"కొంచెం కష్టమేమిటి? చాలా కష్టమయి ఉంటుంది. నీ సంగతి నాకు తెలియందేముందీ? సిగిరెట్లూ-అగ్గి పుల్లలూ




పెళ్లికాక ముందే నా నా గొడవగానూ ఉండేది నీ గదంతా! మునిసిపాలిటీ బండి నీ గది కిటికీ దగ్గర ఆపి చెత్తంతా లోడ్ చేసేవాళ్లు అందులోకి..."

నవ్వుతూ అంది అరుణ. అలా నవ్వుతోన్నప్పుడు ఆమె విపరీతమయిన అందంగా కనిపించింది తనకి. ఆమెమంటి రంగు చామనచాయగా ఉన్నా చక్కని కళగల ముఖం. కళ్లల్లో ఓ విధమయిన ఆకర్షణ ఉంది. ఒక్కసారి ఆమెవంక చూసి ఊరుకుండి పోవడం చాలాకష్టం. కనీసం మరొక్కసారయినా తనివితీరా చూస్తే బాగుండుననిపించేంత అందంగా ఉంటుంది.

తనకూ్కడా నవ్వు కలిగించినయిఆమె మాటలు.

"కొంచెం పరువుంచు! చాలాగుట్టుగా, జాగ్రత్తగా నెగ్గుకొస్తున్నాను మా ఆవిడ దగ్గర..." నవ్వుతూ అన్నారాయన.

"అక్కకన్నీ చెప్పేస్తాగదా! చిన్నప్పుడు నీ చేష్టలూ-కథలూ—"

అందరూ నవ్వేశారు.

పది గంటలకల్లా భోజనం ముగించి వెళ్ళిపోయారాయన.

రెండు రోజులు చాలా సరదాగా నవ్వుతూ, తుళ్లుతూ గడిచిపోయినాయి. ఆ రెండ్రోజులు ఆఫీస్‌నించి త్వరగా వచ్చేశారాయన. ఆయన గురించి చిన్నప్పటి చిలిపి కథలు చాలా చెప్తుండేది అరుణ. ముగ్గురూ చాలా సేపటివరకూ నవ్వుకొంటూండేవారు. ఆ రెండు రోజు

ళ్లోనే తనకు చాలా ఆప్తురాలయిపోయిందామె. తనకు చెల్లెళ్లు లేరు. అరుణ 'అక్కా' అని పిలుస్తోంటే అదోవిధమైన తీయని అనుభూతి కలుగుతుండేది. ఐతే ఆ ఆనందం ఎంతోకాలం నిలవలేదు. ప్రతి ఆడదానికీ సహజసిద్ధమైన గుణం ఒకటుంది. పోటీ ఆడదానిమీద అసూయ. తనూ అతిదారుణంగా ఆ వ్యాధికి గురయింది. అరుణతో మాట్లాడేప్పుడు ఆయన చూపే ఉత్సాహం– తను లేకుండా కూడా గార్డెన్‌లో వాళ్లు నవ్వుతూ మాట్లాడేతీరు తనలో ఓ విధమయిన అసూయ కలిగించినయి. తద్వారా కొన్ని అనుమానాలు! తనతో అంతవరకూ ఆయన అంత హాయిగా, ఆనందంగా ఎప్పుడేనా మాట్లాడారా? ఆఫీస్‌నించి అంత త్వరగా వచ్చేసి కబుర్లుచెపుతూ కూర్చున్నారా? రెండ్రోజులకొక సినిమాకు తీసుకెళ్లారా? శనాదివారాలు రెండురోజులూ గండిపేటకూ, నాగార్జునసాగర్‌కీ, ఇంకా చాలా సాగర్లకీ కార్లో తిప్పారా? ఇలాంటి ప్రశ్నలు క్షణానికొకటి చొప్పున పుట్టి మనసుకి శాంతిని దూరంచేయడంమొదలుపెట్టాయి. పైగా అరుణ ఎందుకొచ్చిందో, ఎన్నిరోజులుంటుందో, వాళ్లాయనకూడాఎందుకు రాలేదో ఏమీ తెలియలేదు. రాన్రాను అరుణతో మనస్ఫూర్తిగా మాట్లాడలేకపోయింది. ఆమెతో కలసి నవ్వుతున్నప్పుడు తన నవ్వులో జీవం కనిపించటం లేదు. భర్తతోకూడా ఇదివరలా సరిగ్గామాట్లాడ్డం కుదరటంలేదు. ఇద్దరిమధ్యా దూరం ఉన్నట్లనిపించసాగింది. అయితే అరుణ చాలా సెన్సిబుల్! అంచేత తనని ఇట్టే అర్థం చేసుకుంది. తన మనసులోని భావాలన్నిటినీ చాలా తేలిగ్గా చదివేసింది. ఆమర్నాడు మధ్యాహ్నం ఆయన ఆఫీసుకెళ్ళిపోయాక తను "హౌటూస్టాప్ వర్రీయింగ్ అండ్ స్టార్టులివింగ్" అనేపుస్తకం చదువుతోంటే అరుణ తన దగ్గరకొచ్చి కూర్చుంది. తను అదేమీ గమనించనట్లే నటించసాగింది. కొద్దిక్షణాలు మౌనంగా కూర్చున్న తరువాత 'అక్కా'అంటూ పిలిచింది నెమ్మదిగా.

పుస్తకం పక్కనపడేసి ఏమిటన్నట్లు ఆమెవంక చూసింది తను.

"నువ్ నా గురించి ఏమనుకొంటున్నావక్కా? ఏమీ దాచకుండా చెప్పెయ్యవూ? ఇవాళ పూర్తిగా మనసులు విప్పి మాట్లాడుకోవాలనుంది నాకు."

తను కొంచెంగా తడబడింది.

"నీ గురించా నే నేమను కొంటానూ?"

"అదే అక్కా! ఈ అరుణెవరూ? ఇక్కడి కెందుకొచ్చిందీ? భర్త ఏమయ్యాడూ? ఇలాంటి ప్రశ్నలు రావటం లేదూ? తప్పకుండా వీటికి సమాధానాలు తెలుసుకోవాలనే ఉంటుంది నీకు...అవునా అక్కా?"

"ఖచ్చితంగా తెలుసుకోవాలనే పట్టుదలేం. .లేదు."

"నాదో చిన్న కథక్కా! వచ్చిందగ్గర్నుంచీ చెప్దామనే అనుకొంటున్నాను. కాని, ధైర్యం చనువు చాలలేదిన్నాళ్ళూ! నేను యస్సల్సీ చదువుతోండగా ప్రేమలో పడ్డాను."


తను నవ్వేసింది.

"ప్రేమ కథన్నమాట."

"ప్రేమ కథేగాని, ఈ కథనిండా కష్టాలూ, కన్నీళ్ళూ నిండిపోయి ఉన్నాయక్కా! ఆనాడు నేను ఏమాత్రం తెలివిగా, ధైర్యంగా ప్రవర్తించి ఉన్నా ఈనాడు నాకీ కథ చెప్పే అవసరం ఉండేది కాదు" కొద్దిగా ఆగింది అరుణ.

ఆమె కళ్ళనిండుగా నీళ్ళు నిలిచినయి.

"అతను అంతకుముందు చాలాకాలం నుంచీ నాకు తెలుసు. మా రెండు కుటుంబాల మధ్యా రాకపోకలున్నాయి. కానీ యస్సల్సీ కొచ్చేవరకూ మేమిద్దరం ఒకరి మనసులో మరొకరు ఆరాధింపబడుతున్నామని తెలీదు. తెలిసే సమయానికి, ఇద్దరం ఒకటవుదామనే నిర్ణయం తీసుకొనేలోపల చాలా సమస్యలు-పరిస్థితులు అడ్డం వచ్చేసినయి. నాకు మరొకతనితో వివాహం అయిపోయింది. వెంటనే విజయనగరం వెళ్ళిపోయా నాయన్తో. అసలు కథ ఇక్కడి నుంచే మొదలవుతుందక్కా! ఒక సంవత్సరంపాటు మా సంసారం సాఫీగానే నడిచింది. ఈలోగా నేను నా ప్రేమ కథను మర్చిపోడానికి శతవిధాల ప్రయత్నించాను.



కాని అప్పుడప్పుడు అతను వ్రాసే ఉత్తరాలు తిరిగి నన్ను యథాస్థితికి తెస్తుండేవి. ఫలితంగా ఆయనతో ఎప్పుడూ మనసిచ్చి మాట్లాడలేక పోయేదాన్ని. సరదాగా సంతోషంగా ఒక్కరోజు కూడా కనిపించలేదు. ఏనాడూ ప్రణయంలో మనస్ఫూర్తిగా పాల్గొనలేకపోయాను. ఆయన్ని చూసినప్పుడల్లా అతను గుర్తుకొస్తూండేవాడు. ఆయన నన్ను కౌగలించుకొన్నప్పుడు అతనితో జరిపిన ప్రేమకలాపాలు గుర్తుకొస్తూండేవి. నా ప్రవర్తన ఆయనకు అనుమానం కలిగించింది. మగాడికి అనుమానం రానేకూడదు. వచ్చిం తరువాత నిజాన్నికూడా నమ్మటానికి సందేహిస్తాడు. పోస్టుమన్ని కలుసుకొని ఇంటికొచ్చే ఉత్తరాలు కూడా ఆఫీసుకే అందేట్లు ఏర్పాటు చేశారు. ఆ రకంగానే అతను

రాసిన ఉత్తరం ఆయన చేతుల్లో పడింది."

"మైగాడ్" ఉలిక్కిపడుతూ అంది తను. ఆ క్షణంలో ఎందుకో గుండెలు కొట్టుకొన్నాయి.

"నువ్వు అతన్ని ఉత్తరాలు రాయొద్దని మందలించి ఉండాల్సింది!" అంది సుజాత.

"అనుకొన్నానక్కా! కాని నావల్ల కాలేదలా మందలించడం. అతని విషయంలో నేను పూర్తిగా బలహీనురాల్ని."

సుజాతకు ఒక్కసారిగా అరుణ మీద జాలి, అభిమానం ముంచుకొచ్చింది.

"తరువాతేమయింది?" ఆత్రుతగా అడిగింది.

"ఆ సాయంత్రం ఆయన ఇంటి కొచ్చారు. రాగానే నన్ను పిలచి పక్కన కూర్చోబెట్టుకొన్నారు. "ఈ ఉత్తరం నీకు వచ్చింది. కొన్ని కారణాలవల్ల నేను చదవాల్సి వచ్చింది. నువ్ చదువుకో! తరువాత దీన్నిగురించి మాట్లాడుకొందాం!" అన్నారు ఉత్తరం నాకందిస్తూ. నేను భయంగానే ఉత్తరం అంతా చదివాను.

"ఎంత ధైర్యం?" విస్తుపోతూ అంది సుజాత.

"ఆసమయంలో నిజంగానే ఏదో ధైర్యం ప్రవేశించిందక్కా నాలో! ఎలాగూ ఆయనకు మా విషయం తెల్సిపోయింది. తెల్సింతర్వాత ఇక చేయగలిగిందీ, దాచగలిగిందీ ఏమీ లేదనిపించింది. ఒకవేళ ఇప్పుడుకాకపోతే, ఎప్పటికయినా ఇలాంటి విషయాలు బయటపడక మానవు."

"అతనెవరూ?" అడిగారాయన.

"మా ఇంటిదగ్గరే వాళ్ళిల్లు - ఇద్దరం కలిసి చదువుకొన్నాం" అన్నాను.

"మీ ఇద్దరూ ఈ ప్రేమకలాపాలు మొదలెట్టి ఎన్ని సంవత్సరాలవుతుంది?"

"రెండు సంవత్సరాలు."

"అంటే పెళ్ళికిముందే మీరు ప్రేమించుకొన్నారన్నమాట."


"అవును."

"మరి పెళ్ళెందుకు చేసుకోలేదు. ఇద్దరు మొగుళ్ళుంటే బావుంటుందనుకున్నావా?"

"మా ఖర్మ కుదరక మాకు పెళ్ళికాలేదు. అంతమాత్రాన మీరు నా గురించి ఇలా నీచంగా మాట్లాడనక్కర్లేదు."

ఈమాట పూర్తికాకుండానే నా చెంప ఛెళ్ళుమంటూ మోగింది. అదే మొదటిసారి ఆయన ఉగ్రస్వరూపాన్నిచూడటం. కళ్లు బైర్లు కమ్మినట్లయింది. నాకు తెలీకుండానే కళ్ళవెంబడి బొటబొటా నీళ్ళు కారిపోయాయి.

"నిన్ను కత్తితో పొడిచెయ్యాలనుంది. ఆనక నేనేమయిపోయినా నా కిష్టమే. నీ లాంటి విషజంతువులను చంపటం మూలాన చాలామంది ఆడపిల్లలకు మంచి




పాఠం నేర్పినవాణ్ణవుతాను" అంటూ చేతులు సొరుగు లాగారు. అందులో బాకు కనిపించలేదాయనకు.

"నేనేం పాపం చేశానని.... మీకంత కక్ష?" అన్నాను గొంతు పెగల్చుకుని. ఆయనకు ఉద్రేకం ఆగలేదు. జుట్టుపట్టుకొని తన చేతులు నొప్పిపుట్టేవరకూ నన్ను గొడ్డులా బాదారు.

"రాక్షసీ! ఎన్నో కలలుగన్న నా జీవితాన్ని సర్వనాశనం చేశావ్! నేన్నీకు ఏం అపకారం చేశాను? నీక్కావాలంటే ఎంత మంది మగాళ్ళులేరు? నాలాంటి యువకుల పచ్చని భావికెందుకిలా చిచ్చుపెట్టావ్?

కోరుకున్న వాడితోనే పోవాల్సింది. లేక పోతే పెళ్ళిచేసుకోకుండా చావాలి! మధ్య మూడో మనిషినెందుకీడ్చావ్?...." గోడకి ఆనుకుని ఒగరుస్తూ ఉద్రేకం, బాధ, విచారం మిళితమయిన గొంతుతో అన్నారు. నేనేమీ మాట్లాడలేదు నాఖర్మ అలాకాలిపోయినందుకు ఏడుస్తూ కూచ్చుండిపోయాను.

"నిజంచెప్పు? నువ్వింకా వాడినే ప్రేమిస్తున్నావ్ కదూ?"

మౌనంగా తలూపాను.

"నీ కొక నమస్కారం చేస్తాను. వెంటనే మీ ఇంటికెళ్ళిపో! కోపంలో నిన్నేంచేస్తానో నాకే తెలీదు. మనం కోర్టు ద్వారా విడాకులు తీసుకుందాం. ఇంక

ప్పుడూ నాకు కనిపించడానికి ప్రయత్నిం చకు. తెల్సిందా?''

అంతే। ఆరోజే మా ఇంటికెళ్ళి పోయాను. ఆ తరువాత మేమిద్దరం కోర్టు ద్వారా విడిపోయాం. ఈలోగా నేను ప్రేమించిన తనకి వివాహం అయిపోయింది నా సంగతి తెలిసి అతను మా ఇంటి కొచ్చాడు. ఇద్దరం నిర్ణయించుకొందేమి టంటే ఒకరిని విడిచి ఒకరు ఉండలేమన్ని ఇదక్కా। నా పరిస్థితి. ఇప్పుడేం చేయాలో అర్థంకావటంలేదు. నా కథంతా చూచాయగా కొంచెం మార్చి ఓ ప్రశ్నరూపంలో నీ జవాబుల శీర్షికకు రాశాను. నీ జవాబెలా ఉంటుందో, ఎలా పరిష్కరిస్తావో చూద్దా మనిపించింది. నీమీద నాకు నమ్మకముం దక్కా। నువ్వేం జవాబిచ్చినా శిరసా వహించేస్తాను.''

సుజాత ఆశ్చర్యపోయింది.

''అలాగయితే ఆ ప్రశ్న వ్రాసింది నువ్వా? ఇంకెవరో అనుకొన్నాను. నాకు బాగా గుర్తుందా ప్రశ్న. ఎంచేతంటే చాలా క్లిష్టమయిందవడంచేత ఎక్కువసేపు ఆలో చించాల్సి వచ్చింది. అఫ్ కోర్స్—పరి ష్కారం దొరికింది కూడా। నన్నడిగితే ప్రతి సమస్యకు ఏదో ఒక పరిష్కార మార్గం ఉంటుంది. అది సావకాశంగా, తెలివిగా ఆలోచించి కనుక్కోకుండా చాలా మంది తొందరపాటు నిర్ణయాలు తీసుకొని బురదలో కాలేస్తూంటారు''

అరుణ మొఖంనిండా సంతోషం వెలిగి పోయింది.

''నాకు తెలుసక్కా నువ్వు నిజంగా ఒక వొండర్ వి।''

''పోస్ట్'' అంటూ రెండు పత్రికలు అందించాడు పోస్ట్‌మన్.

''బహుశా నీ ప్రశ్నకు జవాబు యీ వారంలోనే ప్రచురించి ఉండాలి. చూడు।'' అంటూ పత్రిక అందించింది సుజాత.

అరుణ ఆత్రుతగా పేజీలు తిప్పింది. జవాబుల శీర్షికదగ్గర ఆమె కళ్ళు నిలచి పోయినయి.

''ఇదిగో నా పేరు.


''అరుణ, మచిలీపట్టణం.''

అనేసి త్వరత్వరగా చదివేయ సాగింది అరుణ. చదువుతున్న కొద్దీ ఆమె కళ్ళల్లో వెలుగు అధికమయి పోసాగింది.

''అక్కా నువ్ నిజంగా దేవతవు। జవాబులతోపాటు నీ మనసు కూడా అమృతమయం। నా కివాళ చాలా సంతో షంగా ఉందక్కా।'' అంది ఆనందంగా.

ఆ వేళంతా ఆమె సంతోషంగా కూని రాగాలు తీస్తూ ఇల్లంతా తిరుగుతూనే ఉంది. సాయంత్రం ఆయన ఇంటికొచ్చే సరికి ఆమే పరుగుతో ఎదురువెళ్ళింది.

''ఏమిటి హడావుడి? మీ సుజా తక్కయ్య రాసిన జవాబుని ఎవరయినా సినిమాగా తీస్తున్నారా?'' అన్నారాయన నవ్వుతూ.




"ఛప్! అదేం కాదు. ఇవాళెంత సంతోషమయిన రోజో తెలుసా?"

"ఏమిటి సంగతి? సుజాతేది?" అన్నారాయన గదిలోకి నడుస్తూ!

"వంటింట్లో వుంది. నేనెందుకింత సంతోషంగా ఉన్నానో ఊహించుకోలేవా?"

అతని వెనుకే నడుస్తూ అంది అరుణ.

సుజాత వంటింట్లోంచి బయటకు వస్తుందల్లా రక్కున అక్కడే ఆగిపోయింది.

ఏదో అనుమానం ఆమెలో ప్రవేశించి ఆమెని భయంతో ఊగించివేసింది.

మొఖం పూర్తిగా పాలిపోయింది. మెల్లగా గదిదగ్గరకునడిచి కిటికీలోనుంచి లోపలకు చూసింది లోపల అరుణ ఆయన కౌగిలిలో ఒదిగిపోయి వుంది ఆమె పెదాల మీద గాఢంగా ముద్దుపెట్టుకొంటున్నారాయన. సుజాత కాళ్ళక్రింద భూమీ నెమ్మదిగా కంపిస్తున్నట్లు అనిపించ సాగింది. కళ్ళు తిరుగుతున్నట్లు కూడా వుంది.

"మన సంగతి అంతా చెప్పేశావా?" అడిగారాయన అరుణని.

"నువ్వని చెప్పకుండా మన కథంతా చెప్పేను. అక్కయ్య ఆమాత్రం ఊహించుకోలేకపోతుందా. మనిద్దరం చిన్నప్పటి నుంచీ స్నేహితులం అని చెప్తూ వున్నాం ఓ ప్రక్క. భర్త విడాకులిచ్చేశాడని కూడా చెప్పాను.

నేను మీదగ్గరకు రావటంలో అర్థం ఆ మాత్రం గ్రహించుకోలేదా? పైగా జవాబులో కూడా ఏమిరాసిందో తెల్సా? మనం ముగ్గురం కలసి ఉండటం శ్రేయస్కరం అట. అతని భార్య అంటే సుజాతక్క

కూడా అందుకు అంగీకరించాలట."

నవ్వుతూ అంటోంది అరుణ.

"అంటే మనం ఇన్నాళ్ళూ యమ యాతనపడుతూన్న సమస్య అతి తేలిగ్గా క్షణాల్లో తేలిపోయిందన్నమాట" మరింత గాఢంగా ఆమెని గుండెలకు హత్తుకొంటూ అన్నారాయన.

"నేనూ అనుకోలేదు అక్కా ఇంత మంచిదని. అక్కలాంటి సిన్సియర్ మనుషులెంతమంది వుంటారంటావ్?" మత్తుగా అంది అరుణ.

"సరిగ్గా అదే సమయంలో ఆయన కళ్ళు కిటికీదగ్గరనుంచున్న తనమీద పడినయి. గాభరాగా అరుణని దూరంగా నెట్టి నిలబడ్డారు. మొఖంనిండా సిగ్గు, భంగారు అలుముకొన్నాయి. వాటిని దాచటానికి ప్రయత్నిస్తూ చిన్నగా నవ్వి "రాసుజీ, అక్కడే నిలబడ్డావేం?" అన్నారు. అరుణ బెదురుగా తలుపువేపు చూసింది. ఏం చేయాలో సుజాత కర్ధంకాలేదు. వెనక్కి పరిగెత్తుకు పోదామనిపించిందిగానీ, ఏదో శక్తి తనని ముందుకి నడిపించింది. గది లోకి నడిచి డ్రస్సింగ్‌టేబుల్ దగ్గరగా నిలబడిపోయింది. కొద్దిక్షణాలు అతి నిశ్శబ్దంగా గడిచినయి.


"హ....అదే .... అరుణ చెప్తోంది. ఇప్పుడే నీ గురించి అరుణకూ నాకూ మధ్య కథ తెలిసినా నువ్వేమీ అభ్యంతరం చెప్పలేదనీ-అఫ్‌కోర్స్-అసలు నేనేఎప్పటి నుంచో నీకీవిషయంచెప్పాలని....కాని.... గిల్టీకాంషస్. సైకలాజికల్‌గా పిరికితనం అది నువ్వెలా తీసుకొంటావోనని భయం. కాని నాకు నమ్మకమే. ఓవేళ నేను చెప్ప గలిగితే నువ్వు చాలా సింపథటిక్‌గా ట్రీట్ చేస్తావని మన పెళ్ళవుతున్నప్పుడు ఇలాంటి పరిస్థితి వస్తుందని నేననుకో లేదు....ఇప్పుడు ఇటు నిన్నూ-అటు అరుణనీ ఎవ్వరినీ వదులుకొనే స్థితిలోలేను.... నీకు తెలీకుండా చాటుమాటు వ్యవహారాలు సాగించడం కూడా నాకిష్టంలేదు. చివరకు ఈ విషయం నీ ముందుంచటానికి అరుణే ధైర్యం చేసింది....."

అక్కడక్కడ తడబడుతూ మాట్లాడా రాయన.

"నాకు డైరక్టుగా చెప్పడానికి ధైర్యం చాల్లేదక్కా. అందుకే ముందు నీ జవాబుల శీర్షికకు ప్రశ్నగా పంపించాను. ఇందాక జవాబు చూశాక నాకు పూర్తి ధైర్యం వచ్చింది."

నెమ్మదిగా తలవంచుకొనే అంది అరుణ.

సుజాత పళ్ళతో క్రిందిపెదిమని నొక్కి పట్టి దుఃఖాన్ని తమాయించుకొంది. అతి కష్టంమీద చిన్నగా నవ్వి "పదండి కాఫీలు తీసుకొందాం?" అనేసి అక్కడినుంచి చకచక వంటింటివేపు నడిచింది. వంటింట్లో కొచ్చేసరికి ఆమెకు దుఃఖం ఆగలేదు. మొఖంమీద చేతులుంచుకొని వెక్కి-వెక్కి ఏడవటం మొదలు పెట్టింది. ఏడుస్తూనే




కప్పుల్లోకి కాఫీ నింపి చీరచెంగుతో మొఖం తుడుచుకొంది. రెండు నిమిషాలు ఏడ్చేసరికి మనసులో కొంత భారం తగ్గినట్లయింది. ఈలోగా అరుణ లోపలకు వచ్చేసింది.

"ఆయన మొఖం కడుక్కొని వస్తున్నారక్కా. ఈలోగా మనం తాగేద్దాం. చల్లారిపోతుందేమో'' అంది. తనకళ్ళల్లోకి చూడ్డానికి ఆమెకు మనస్కరించడంలేదని ఇట్టే తెలిసిపోతోంది.

ఇద్దరూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని చెరో కప్పూ అందుకొన్నారు.

ఇంకా కాఫీ త్రాగుతూండగానే ఆయన కూడా లోపలికొచ్చేశారు.

"నాకూడా ఇవాళ చాలా ఆనందంగా వుంది సుజీ! తలమీదనుంచి పెద్ద బరువు దింపేసినట్లయింది. మనం ఇవాళ సినిమాకెళ్ళి కాసేపుసర్దాగా గడిపివద్దాం పదండి.... త్వరగా రడీ అవాలి.... అట్టే టైమ్‌లేదు.'' అన్నారు సాధ్యమయినంత మామూలుగా మాట్లాడ్డానికి ప్రయత్నిస్తూ.

గట్టిగా ఏడ్చేసి ఇద్దరినీ నాలుగూ దులిపేసి అక్కడినుంచి పారిపోదామనిపించింది సుజాతకి. కాని అతి బలవంతం మీద ఆ కోర్కెను అణిచి వేసుకొంది.

ఇదిలా అల్లరిపడి తేల్చుకొనే సమస్య కాదు. తనకొంచెం వ్యవధికావాలి.

"నీదే ఆలస్యమక్కా! నేను రడీ అయిపోయాను....'' నవ్వుతూ తనదగ్గర కొచ్చి అంది అరుణ.

బాత్‌రూంలోకి నడిచి మొఖం కడుక్కొని చీర మార్చుకోసాగింది. అరుణ అప్పటికే తయారయి హాల్లో రేడియో ముందు కూర్చుని 'యువవాణి' ప్రోగ్రాం వింటోంది.

వెనుకనుంచి మెల్లగా వచ్చి తటాలున తనను దగ్గరకు లాక్కొన్నారాయన. అదాటున జరగటం మూలాన సుజాత పూర్తిగా అతని కౌగిలిలోకి జారిపోయింది. ఇన్నాళ్లూ మైకం కలిగించిన ఆ కౌగిలి ఆరోజు వెగటు కలిగిస్తోంది. అదివరకు ఆ కౌగిలి సుఖాన్ని కోరుకొనే శరీరం ఇప్పుడు ఎటువంటి అనుభూతినీ పొందటం లేదు.

"సుజీ! నువ్వు మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నావా, అరుణ మనతో ఉండటానికి?" తన కళ్ళల్లోకి చూస్తూ అన్నారాయన.

"సినిమాకి టైమవుతోంది. పదండి!" అంది పొడిగా నవ్వి ఆయన చేతులనుండి తప్పించుకొంటూ.

ముగ్గురూ కార్లో థియేటర్ చేరుకొన్నారు

ఏదో హిందీ సినిమా: ఆయన పక్కనే తను. తన పక్కన అరుణ!

సినిమా మొదలయింది. ఏదో నవ్వుతూ తనతో అంటున్నారాయన. తనకేమీ అర్థం కావటంలేదు. కళ్లు తెరిచి కూర్చుంటే కళ్లు తిరుగుతున్నట్లుంది. అంచేత ఉండుండి కళ్లు మూసుకోసాగింది కొద్ది క్షణాలపాటు. వళ్ళంతా జ్వరమొచ్చినట్లు వెచ్చబడింది. తల పోటు—తనేమయిపోతోంది. తన గతేమిటి? ఇంతకంటె అవమానం ఇంకేమయినా ఉంటుందా? స్నేహితుల్లో—బంధువుల్లో ఎంత అవమానం? నగుబాటు? ఇంతకంటె ఆత్మహత్య చేసుకు చావడం మంచిది.

ఇంటర్వెల్ అయింది.

కూల్‌డ్రింక్స్ అందించారాయన.

నవ్వుతూ ఏదో అంది అరుణ. ఇద్దరూ నవ్వారు.

తనకేమీ తెలియటంలేదు. కళ్ళప్పగించి చూస్తోంది వాళ్లు నవ్వితే తనూ నవ్వుతోంది

సినిమా మళ్ళీ మొదలయింది.

ఏదో కేకలు యుద్ధాలు—భీషణ పోరాటం—అంతా తనతలలోనే జరుగుతున్నట్లు తలనొప్పి—

'జనగణమన' వినబడి లేచినుంచుంది

ఇల్లు చేరుకొన్నారు హోటల్లో భోజనం ముగించి.

"బాగా అలిసినట్లు కనిపిస్తున్నావ్ సుజ్..." అన్నారాయన.

"అవును..." అంది తను గొణుగుతున్నట్లు.

చీర కూడా మార్చుకుండానే అలాగే మంచం మీద వాలిపోయింది. తరువాత ఇంకేమీ తెలియలేదు. తిరిగి మెలకువ వచ్చేసరికి గడియారం ఒంటిగంట కొట్టింది.

పక్కన మంచం ఖాళీగా ఉంది. అరుణ కనిపించలేదు.

లేచి పక్కగదిలోకి నడిచింది సుజాత.

భర్త ప్రక్కనే అయన్ను కరచుకొని అద మరిచి నిద్రపోతోంది అరుణ.

వాళ్ళిద్దరినీ అలా చూసినా ఆమె కెటు వంటి భావమూ కలుగలేదు. మనసెంచేతో చాలా ప్రశాంతంగా ఉంది.

ఉదయం అరుణకి మెలకువ వచ్చేసరికి చాలా పొద్దు ఎక్కింది. పైము ఎనిమిదవు తోంది. సిగ్గుపడి ఛటుక్కున మంచం మీద నుంచి లేచి నుంచుంది

అతను కూడా మేలుకొన్నాడు.

పక్కనే స్టూల్ మీద గాజు గ్లాసుకింద ఎర్రని కాగితం, దానిమీద నల్లని అక్ష రాలు కింద సుజాత అన్న పేరు కనిపించి వయి. ఖంగారుగా ఆ కాగితం తీసుకొని చదవసాగింది అరుణ. అతని కూడా మత్తు వదిలినట్లలేయి చినుంచుని ఆకాగితం లోకి చూశేడు

అరుణా,

నిన్న నువ్వు ఈ కథ చెప్పినప్పుడు ఆ కథ నాకుసంబంధించినది కాదనుకొన్నాను. అందుకే నా మనసుకి మంచి అనిపించిన పరిష్కారం చెప్పాను. ఇన్నాళ్లూ కాగితం మీద అనేకమంది జీవితాలు జవాబుల రూపంలో చక్కబెట్టాననుకొంటూవచ్చాను కానీ నిన్నటితో నా అభిప్రాయం తప్పని తెలిసొచ్చింది. ఉదాహరణ నేనే. నీ ప్రశ్నకు జవాబు వ్రాస్తున్నప్పుడే నేను ఆ పరిస్థితిలో నేనుంటే ఎలా వుంటుందో అని ఆలోచించ లేదు. 'మరొకరికి సంబంధిం చిన సమస్య' అన్న దృష్టితో ఆలోచిం చాను. పర్యవసానంగా ఓ మతి లేని జవాబు-అతి తెలివి తక్కువనా-ఇచ్చాను తీరా అది నాకే చెందేసరికి ఆచరించటంలో దారుణంగా ఫెయిలయ్యాను. ఈ ఉదయం నాలుగింటివరకూ కూడా ఆలోచిస్తూనే ఉన్నాను. ఒక ఒఱలో రెండు కత్తులు ఇమడవు. పూర్వం రోజుల సంగతేమో గానీ ఈ రోజుల్లో పెరిగిన ఏ ఆడపిల్లా ఏమాత్రం ఆత్మాభిమానం ఉన్నా-ఇలాంటి పరిస్థితికి తల ఒగ్గదు—నిన్ను నాతోపాటు ఉంచడానికి ఓ వేళ నేను వప్పుకోపోతే ఏం జరుగుతుందో నాకు తెలుసు. నువ్వు మీ ఇంటికి వెళ్ళిపోతావ్. మీ తల్లిదండ్రుల దగ్గర మిగతా జీవితం గడిపేస్తావ్. ఆయన అప్పుడప్పుడూ నిన్ను రహస్యంగా కలుసు కొంటాడు. కాని ఇంట్లో నా జీవితం దుర్భరమై పోతుంది. మా ఇద్దరి మధ్యా ఓ గోడ శాశ్వతంగా ఎదిగి పోతుంది. జీవచ్ఛవంలా బతకాల్సిందే: ఈ పరిస్థితి నా కిష్టంలేదు. మీ ఇద్దరి మధ్యా ఉండ టమూ నా వల్ల కాదు —అంచేత-అందు కనే మా ఇంటికెళ్ళి పోతున్నాను. మళ్ళీ మిమ్మల్ని చూడకుండానే నా జీవితాన్ని ముగించివేయమని భగవంతుణ్ని ప్రార్థిస్తు న్నాను. దయచేసి మీ ఇద్దరిలో ఎవ్వరూ నా దగ్గరకురావటానికి ప్రయత్నించవద్దు ఎవరి కయినా సహనానికి ఓ హద్దుంటుంది— నేనా హద్దుకి సరిహద్దుల్లో ఉన్నాను ఎలాగూ మా ఇద్దరి మధ్యా ఇదివరకటి సంబంధం నెలకొనదు. కనీసం మీ ఇద్ద రయినా ఆనందంగా ఉండండి: మరో విషయం - జవాబుల శీర్షిక నుంచి తప్పుకొంటున్నాను నావల్ల ఎవ్వరికీ ఎటువంటి ప్రయోజనమూ లేదని తెలుసు కొన్నాను. ఉత్తరం కూడా రాయకు.

సుజాత.

అరుణ చలనం లేకుండా నిలబడి పోయింది.